సాక్షి తిరుపతి

బుధవారం। 20। నవంబర్। 2024



మమ్మల్ని ఆపేదెవడ్రా?

నాయుడుపేటలో అధికార పార్టీ నేతలు పేట్రేగిపోతున్నారు. అడ్డూఅదుపూ లేకుండా ఇసుక దందాకు పాల్పడుతున్నారు. - 8లో



24న గ్రామీణ ఆటల ఉత్సవం

తిరుపతి ఎస్వీయూ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈనెల 24న గ్రామీణ ఆటల ఉత్సవాలు నిర్వహించనున్నట్టు కలెక్టర్ తెలిపారు. - 8లో



ఏటీఎంలో చోరీకి యత్నం

నాయుడుపేటలోని ఏటీఎంలో ఓ వ్యక్తి చోరీకి యత్నించి విఫలమయ్యాడు. గునపంతో ఏటీఎంను బద్దలు కొట్టాడు. - 8లో

న్యూస్‌రీల్

ఆగమోక్తంగా ఆకాశదీపం



కార్తీక దీపాన్ని ఎగురవేస్తున్న ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం ఆకాదీపాన్ని శాస్త్రోక్తంగా వెలిగించారు. ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రతిరోజూ ఆకాశ దీపాన్ని సంప్రదాయబద్ధంగా వెలిగిస్తుంటారు. ఆలయంలోని ఊంజల్‌సేవ మండపం వద్ద ఏర్పాటు చేసిన కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి దర్శించుకున్నారు.

పది పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

తిరుపతి ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే రెగ్యులర్, ఒకసారి ఫెయిలైన విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించేందుకు, నామినల్ రోల్స్ సమర్పించేందుకు ఈ నెల 26వ తేదీ వరకు రాష్ట్ర విద్యాశాఖ గడువు పొడిగించినట్లు డీఈఓ కేవీఎస్.కుమార్ తెలిపారు. రూ.50 అపరాధ రుసుముతో ఈ నెల 27 నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు, రూ.200 అపరాధ రుసుముతో డిసెంబర్ 3 నుంచి 9వ తేదీ వరకు, రూ.500 అపరాధ రుసుముతో డిసెంబరు 10 నుంచి 16వ తేదీ వరకు చెల్లించవచ్చని డీఈఓ పేర్కొన్నారు.

కనీస వేతనాలు ఇవ్వండి

తిరుపతి సిటీ: ఎస్వీయూలో పనిచేస్తున్న ఎన్ఎంఆర్, డైలీ వేజ్ ఉద్యోగులకు కనీస జీతాలు అమలు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ వర్సిటీ అధికారులను ఆదేశించారు. దీంతో మంగళవారం వీసీ సీహెచ్.అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, వర్సిటీ ప్రిన్సిపాళ్లు, వర్సిటీ ఫైనాన్స్ అధికారి, నాన్ టీచింగ్ అధికారులు కలెక్టర్ ఆదేశాలపై చర్చించి 'మినిమం వేజ్' అమలు చేసి, జీతాలు పెంచాలని నిర్ణయించారు. దీంతో ఎన్ఎంఆర్, డైలీ వేజ్ ఉద్యోగులకు సుమారుగా నెలకు రూ.వెయ్యి వేతనాలు పెరగనున్నాయి. పెంచిన వేతనాలు 2024 ఏప్రిల్ నుంచి అమలులోకి రానున్నట్లు తెలిస్తోంది. దీంతో సుమారు రూ.7 వేల అరియర్స్ చెల్లించనున్నట్లు అధికారులు తెలిపారు. మినిమం వేజ్ అమలు చేయడంపై ఆదేశాలు జారీచేసిన కలెక్టర్, వర్సిటీ అధికారులకు తాత్కాలిక ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహ్ అవార్డుకు అర్హులైన క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలని డీఎస్‌డీఓ సయ్యద్ సాహెబ్ తెలిపారు. క్రీడాకారులకు కేంద్రం అందించే మేజర్ ధ్యాన్‌చంద్, ఖేల్ రత్న, అర్జున, ద్రోణాచార్య అవార్డులతో పాటు మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో రాణిస్తున్న క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఖేల్ ప్రోత్సాహ్ అవార్డును కేంద్రం ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 'డీబీటీవైఏఎస్.ఎస్‌పీఓఆర్‌టీఎస్.జీఓవీ.ఇన్' వెబ్ సైట్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు డీఎస్‌డీఓ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.



వేతనాలు చెల్లించడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్న కార్మికులు

అగ్గి రాజేసి.. బతుకు ఊడ్చేసి!

సాక్షి ఫోకస్

ప్రాణాలకు తెగించి రోగుల మలినాలను శుభ్రం చేస్తుంటారు. ఆస్పత్రుల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశ్రుభంగా ఉంచేందుకు చెమటలు చిందిస్తుంటారు. అయితే వీరికి అందాల్సిన వేతనాలు మాత్రం సంబంధిత కాంట్రాక్టర్ దిగమింగేస్తున్నారు. అరకొర సిబ్బందిని నియమించి నిత్యం వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. ప్రతి నెలా పీఎఫ్ డబ్బులను సంబంధిత కార్మికుల ఖాతాల్లో జమ చేయకుండా స్వాహా చేసేస్తున్నారు. ప్రశ్నించిన కార్మిక వర్గాల మధ్య అగ్గి రాజేసి చలికాసుకుంటున్నారు. అక్రమార్జనలో వాటాలందుకుంటున్న అధికారులు శ్రమదోపిడీకి తమ వంతు సహకారం అందిస్తున్నారు. పేదల పెద్దాస్పత్రిగా పేరుగాంచిన తిరుపతి రుయా, మెటర్నిటీ ఆస్పత్రుల్లో కొనసాగుతున్న నిరంకుశ దందాపై 'సాక్షి' స్పెషల్ ఫోకస్..!

పారిశుద్ధ్య కార్మికుల ఆకలి కేకలు

- కాంట్రాక్టర్ చెప్పుచేతల్లో నలిగిపోతున్న సిబ్బంది
- రుయా, మెటర్నిటీ ఆస్పత్రుల్లో అరకొర సిబ్బందితోనే విధులు
- ప్రశ్నించిన వారిపై వేధింపులు
- కార్మిక వర్గాల మధ్య చిచ్చుపెట్టి వేడుక చూస్తున్న కాంట్రాక్టర్
- పీఎఫ్ డబ్బులు సైతం జమచేయని సంస్థ
- వాటాలందడంతో చూసీ చూడనట్లు వదిలేస్తున్న అధికారులు

తిరుపతి తుడా : నగరంలోని రుయా ఆస్పత్రి 1,100 బెడ్ల సామర్థ్యంతో పేద రోగులకు వైద్య సేవలందిస్తోంది. అయితే ఇక్కడ పారిశుద్ధ్యం పడకేసింది. పర్యవేక్షించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతుండడమే ఇందుకు కారణం. ఆస్పత్రిలో కాంట్రాక్టర్ పారిశుద్ధ్య నిర్వహణకు కుదుర్చుకున్న ఒప్పందం మేరకు కార్మికులను నియమించకపోగా అరకొరగా పనికి పెట్టుకున్న పారిశుద్ధ్య కార్మికుల వేతనాల్లో భారీ కోతలు విధించి, వారి కడుపు కొడుతున్నారు.

రుయాలో మరీ దారుణం

రుయా ఆస్పత్రిలో బెడ్ల సామర్థ్యం ప్రకారం 204 మందితో పనులు చేయించేలా ప్రభుత్వంతో కాంట్రాక్టు సంస్థ ఒప్పందం చేసుకుంది. అయితే సదరు కాంట్రాక్టు సంస్థ కేవలం 110 మందితో పనులు చేయించి, 204 మంది వేతనాలను రాబడుతున్నట్టు అధికార వర్గాల సమాచారం. రుయాలో పారిశుద్ధ్య నిర్వహణకు ఏడాదికి రూ.6.6 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఇందులో సగానికి పైగా పనులు చేయించకుండానే కాంట్రాక్టు సంస్థ మింగేస్తోంది. కార్మికులకు ప్రభుత్వ జీఓ ప్రకారం రూ.18 వేలు చెల్లించాల్సి ఉన్నా రూ.12 వేలకు మించి వేతనం ఇవ్వడం లేదు. నాలుగు నెలలు వేతనాలు కాంట్రాక్టు సంస్థ దగ్గర ఉంచుకుని, కార్మికులను నోరెత్తకుండా చేస్తోంది. ఈ విషయం ప్రశ్నించే వారికి సరిగ్గా విధులు కేటాయించకుండా వేధిస్తోంది. కార్మికులు రెండు వర్గాలుగా విడిపోయి ఒకరిపై ఒకరు దాడులు చేసుకునేలా కాంట్రాక్టు సంస్థ ఉసిగొల్పుతోంది. అయితే కాంట్రాక్ట్ సంస్థకు చట్టబద్ధంగా పారిశుద్ధ్య నిర్వహణ నిధులు పూర్తి స్థాయిలో వచ్చేందుకు ఆస్పత్రి అధికారులు సంపూర్ణ సహకారం అందిస్తున్నారు. మూడేళ్లుగా పీఎఫ్ పేరుతో కార్మికుల వేతనాల్లో కోత విధిస్తూ ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించకుండా కాంట్రాక్టు సంస్థ స్వాహా చేసింది.

ఎఫ్ఆర్ఎస్‌కే మస్కా

ఉద్యోగులు, సిబ్బంది పారదర్శకంగా విధులు నిర్వర్తించేలా ప్రభుత్వం ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రికగ్నైజ్డ్ సిస్టమ్)ను తీసుకొచ్చింది. అయితే కాంట్రాక్టర్ ఏకంగా ఎఫ్ఆర్ఎస్‌కే మస్కా కొట్టిస్తున్నాడు. రోజూ ఎఫ్ఆర్ఎస్ వేయించేందుకు కొంతమందిని ఏర్పాటు చేయించాడు. వీరు రోజూ రెండు సార్లు ఎఫ్ఆర్ఎస్ వేసి వెళ్లిపోతుంటారు. ఇందుకు వారికి ప్రతినెలా రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు ముట్టజెబుతున్నారు. ఇలా అక్రమంగా ఎఫ్ఆర్ఎస్ వేయించేందుకు 70 మంది వరకు బయట వ్యక్తులు ఉన్నారని ఆస్పత్రి సిబ్బంది బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఈ అక్రమాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. తమ వాటా తమకు వస్తుండడంతో అధికారులు సైతం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నాలుగు నెలలుగా అందని వేతనాలు

తిరుపతి మెటర్నిటీ ఆస్పత్రిలో 60 మంది పారిశుద్ధ్య కార్మికులతో పనులు చేయించాలని ప్రభుత్వంతో ఏవన్ సర్వీస్ కాంట్రాక్ట్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. అయితే కాంట్రాక్టర్ 30 మంది కార్మికులతోనే నెట్టుకొస్తూ.. 60 మంది వేతనాలను మంజూరు చేయించుకుంటున్నట్టు తెలుస్తోంది. నిబంధనల మేరకు ఒక్కొక్క కార్మికుడికి నెలకు రూ.18 వేలు వేతనం అందాల్సి ఉన్నా ఆ నిబంధన అమలు కావడం లేదు. పీఎఫ్ పేరుతో నెలనెలా ఒక్కొక్కరి నుంచి రూ.2 వేలు కోత విధిస్తున్నా ఆ మొత్తం కార్మికులకు చేరడం లేదు.

కలెక్టర్ దగ్గరే తీసుకోమంటున్నారు



జీతాలు ఇవ్వలేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తారా?. అయితే కలెక్టర్ దగ్గరికే వెళ్లి ప్రతి నెలా జీతాలు తీసుకోండంటూ మమ్మల్ని వేధింపులకు గురిచేస్తున్నారు. ఎప్పుడూ నాలుగు నెలల జీతం వారి వద్ద ఉంచుకుని ఆపై నెల నుంచి మాత్రమే ఇస్తున్నారు. అధికారుల వద్దకు వెళితే ఇక అప్పటి నుంచి డ్యూటీలు ఇవ్వరు. మీ వల్ల ఏమైతే అది చేసుకోండి ఎక్కడికి వెళతారో వెళ్లడని మాపై దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారు.

– అనురాధ, వర్కర్, రుయా ఆస్పత్రి

ఇంటి అద్దె కట్టలేకున్నాం



నెలల తరబడి జీతాలు ఇవ్వడం లేదు. దీంతో ఇంటి అద్దె కూడా కట్టలేకున్నాం. ఈ జీతాలను నమ్ముకుని పూర్తిగా అప్పుల పాలైపోయాం. మా బాధలు పట్టించుకునే వారు లేరు. కనీస వేతనాలు ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్నారు. ఇలాంటివి ఏవైనా అడిగితే దాడులు చేయిస్తున్నారు. దీంతో చేసేదేమీ లేక మేము మిన్నకుండి పోవాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు ఇప్పుడైనా పట్టించుకుని మాకు న్యాయం చేయాలి.

– రమణమ్మ, వర్కర్, రుయా ఆస్పత్రి

గుర్తింపు కార్డు ఇవ్వడం లేదు



తక్కువ మందితో పనులు చేయించుకుంటున్నారు. కనీస వేతనాలు ఇవ్వడం లేదు. వర్కర్‌గా మాకు గుర్తింపు ఇవ్వడం లేదు. గుర్తింపు కార్డులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. అడిగితే తప్ప నెలల తరబడి జీతాలు ఇవ్వరు. ఫలితంగా మా బతుకులు అధ్వానంగా మారుతున్నాయి. బతకడం కష్టమవుతోంది. ప్రభుత్వం స్పందించి కార్మికులను మోసం చేస్తున్న కాంట్రాక్ట్ సంస్థపై చర్యలు తీసుకోవాలి.

– నాగజ్యోతమ్మ, వర్కర్, మెటర్నిటీ ఆస్పత్రి

20 ఏళ్లుగా ఎప్పుడూ ఇలా లేదు



నేను మెటర్నిటీలో 20 ఏళ్లుగా పనిచేస్తున్నాను, జీతాల విషయంలో మాకు ఇప్పుడు జరుగుతున్న అన్యాయం గతంలో ఎప్పుడూ జరగలేదు. జీతాల కోసం అడుక్కోవాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. మాకు జరుగుతున్న అన్యాయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళితే మాపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుని, మాకు ప్రతి నెలా సక్రమంగా జీతాలు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మునిరాజమ్మ, వర్కర్, మెటర్నిటీ ఆస్పత్రి

మూడేళ్లుగా పీఎఫ్ లేదు



నిత్యం మలినాలను శుభ్రం చేస్తున్న మా డబ్బులు కొట్టేస్తున్న కాంట్రాక్టు సంస్థ సర్వనాశనం అయిపోతుంది. చెత్త తోసుకునే మా డబ్బులు తినడం దుర్మార్గం. మూడేళ్లుగా మా నుంచి పీఎఫ్‌ను వసూలు చేస్తున్నారు. అయితే ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా మాకు తిరిగి చెల్లించలేదు. ఏ వన్ సర్వీసెస్ సంస్థ ప్రభుత్వం మాకిచ్చిన వేతనాల నుంచి రూ.కోట్లు దండుకొంటోంది. సగం మందితో పనులు చేయిస్తుండడంతో మాపై పని భారం పడుతోంది.

-కే లక్ష్మి వర్కర్, మెటర్నిటీ ఆస్పత్రి

నిరవధిక సమ్మె తప్పదు



కార్మికుల కడుపు కొడుతున్న కాంట్రాక్టు సంస్థపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవు. రుయా, మెటర్నిటీ ఆస్పత్రుల్లో పారిశుద్ధ్య నిర్వహణ నిబంధనలు అమలు కావడం లేదు. కనీస వేతనాలు, ప్రతి నెలా జీతాలు చెల్లింపు, పూర్తిస్థాయిలో వర్కర్ల నియామకం వంటివి జరగడం లేదు. ఈనెల చివరకల్లా నాలుగు నెలల వేతనాలు చెల్లించని పక్షంలో నిరవధిక సమ్మెకు దిగుతాం అధికారులతో పాటు ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధంగా ఉన్నాం.

-మహేంద్ర, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి

● నాట్లు వేసి నిరసన



'మేం అధికారంలోకి వస్తే రోడ్లను అద్దాల్లా మెరిపిస్తాం.. గతుకులు బొతుకులు లేకుండా చూడముచ్చటగా తీర్చిదిద్దుతాం..' అంటూ ఎన్నికల్లో జబ్బలు చరిచిన కూటమి నేతలు అధికారం వచ్చాక చేతులెత్తేశారు. అధికారం చేపట్టి ఆరు నెలలు గడుస్తున్నా ఇంతవరకు కనీసం గుంతలు కూడా పూడ్చిన దాఖలాలు లేవు. దొరవారిసత్రం మండలం, కల్లూరు గ్రామంలో నిన్నమొన్నటి వరకు కురిసిన వర్షాలకు వీధులు జలమయమయ్యాయి. వీటికి మట్టి తోలి బాగు చేయాలని గ్రామస్తులు పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. దీంతో విసిగిపోయిన గ్రామస్తులు, మహిళలు మంగళవారం వీధుల్లో నాట్లు వేసి నిరసన తెలిపారు. – దొరవారిసత్రం

భూసేకరణ వేగవంతం చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జేసీ శుభం బన్సల్‌తోపాటు జాతీయ రహదారుల పీడీలు, రైల్వే, రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. భూసేకరణలో సమస్యలుంటే తమకు తెలియజేస్తే వాటికి పరిష్కారం చూపుతామని స్పష్టం చేశారు. మరోవైపు జాతీయ రహదారుల నిర్మాణంలో పురోగతి చూపాలని పీడీలను ఆదేశించారు. కాలూరు- పీలేరు, రేణిగుంట -నాయుడుపేట, గూడూరు, సూళ్లూరుపేటకు సంబంధించిన సాగర మాల రహదారుల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు.

పర్యాటక అభివృద్ధికి భూసేకరణ

పారిశ్రామిక, పర్యాటక అభివృద్ధికి అవసరమైన మేరకు భూసేకరణ చేపట్టాలని కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన జిల్లా అధికారులతో మాట్లాడారు. తిరుపతి నగరంతోపాటు రేణిగుంట ఎయిర్‌పోర్ట్ పరిధిలో పారిశ్రామిక, పర్యాటక అభివృద్ధికి అంతా సహకరించాలని సూచించారు. తిరుపతి నగరపాలక కమిషనర్ నారపురెడ్డి మౌర్య, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ చంద్రశేఖర్, టూరిజం రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్ పాల్గొన్నారు.



- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో లంచావతారులు
- పత్రాలు సక్రమంగా ఉన్నప్పటికీ వంకలు పెడుతున్న ఉద్యోగులు
- హల్‌చల్ చేస్తున్న ప్రైవేటు వ్యక్తులు

కాసుక్కూర్చున్నారు!



తిరుపతి అర్బన్ : ఆస్తుల క్రయవిక్రయాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లకు పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంలో సబ్‌రిజిస్ట్రార్ల తీరును తప్పుపడుతున్నారు. డాక్యుమెంట్స్ అన్నీ పక్కాగా ఉన్నప్పటికీ ఏదో ఒక వంకను చూపి రిజిస్ట్రేషన్ ఆపేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. కేవలం కాసుల కోసమే సాకులు చూపుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వారు అడిగింది ఇచ్చేస్తే వెంటనే పని అయిపోతోందని వెల్లడిస్తున్నారు. అయితే వారు చెప్పింది ఇస్తే అలాంటి ఇబ్బందులు తప్పుతున్నాయి. జిల్లాల పునర్విభజన నాటి నుంచి తిరుపతి జిల్లాలో రిజిస్ట్రేషన్ల జోరుగా సాగుతున్నాయి. అందుకు తోడు తాజాగా వచ్చే డిసెంబర్ నుంచే భూముల రిజిస్ట్రేషన్ ధరలు భారీగా పెంచుతున్నారని పత్రికల్లో వస్తున్న కథనాలపై క్రయవిక్రయదారులు ముందే రిజిస్ట్రేషన్ చేయించుకుంటే సరిపోతుందని భావిస్తున్నారు. జిల్లాలో 12 సబ్‌రిజిస్ట్రర్ కార్యాలయాలున్నాయి. ఏడాదిలో వివిధ అంశాలకు సంబంధించి లక్షకుపైగా డాక్యుమెంట్స్ రిజిస్ట్రేషన్ అవుతున్నాయి. దీంతో ప్రభుత్వానికి ఏటా రాబడి రూ.250 కోట్ల నుంచి రూ.300 కోట్ల మేరకు వస్తోంది. 2020–21 ఈ రెండేళ్ల మాత్రమే కోవిడ్ నేపథ్యంలో రిజిస్ట్రేషన్ల జోరు తగ్గింది. జిల్లాలో ప్రధానంగా తిరుపతి, రేణిగుంట, తిరుపతి రూరల్, శ్రీకాళహస్తి, గూడూరు, చంద్రగిరి, వెంకటగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అధికంగా రిజిస్ట్రేషన్లు సాగుతున్నాయి. ఈ క్రమంలోనే ముందుగా ఈ కార్యాలయాల్లో అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు సీసీ కెమెరాలు సైతం ఏర్పాటు చేశారు. ఆ తర్వాత అన్ని కార్యాలయాల్లోను సీసీ కెమెరాలు అమర్చారు. అయినప్పటికీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది ఇష్టారాజ్యంగా అడ్డగోలు పనులు చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే అవినీతికి అడ్డాగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు మారుతున్నాయని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

తిరుపతిలో ఇక్కట్లు అధికం

తిరుపతి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవడం రోజురోజుకు కష్టంగా మారుతోందని పలువురు కొనుగోలుదారులు వాపోతున్నారు. అన్ని డాక్యుమెంట్స్ సక్రమంగా ఉన్నప్పటికీ పక్కన పెట్టేస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. గతంలో రోజుకు 200 వరకు రిజిస్ట్రేషన్లు జరిగేవని, అయితే ప్రస్తుతం 20 నుంచి 30 మాత్రమే పూర్తవుతున్నాయని వెల్లడిస్తున్నారు. తిరుపతిలో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు ఉన్నప్పటికీ పనుల్లో జోరు లేదని ఆరోపిస్తున్నారు. రిజిస్ట్రేషన్ కోసం రెండు మూడు రోజులపాటు కార్యాలయానికి తిరగాల్సి వస్తుందని మండిపడుతున్నారు. మరోవైపు రాత్రి పది గంటల వరకు ఉద్యోగులు కార్యాలయంలోనే ఉంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. సాయంత్రం 5 గంటలకు రిజిస్ట్రేషన్ల వ్యవహారం పూర్తి అయినప్పటికీ రాత్రి వేళల్లో కూడా అక్కడే ఉండడమేంటని చర్చించుకుంటున్నారు.. అలాగే ప్రైవేటు వ్యక్తుల దందా కూడా ఎక్కువగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. వసూళ్ల బాధ్యతలను వీరే చేపట్టినట్లు సమాచారం.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ తక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో ఒక కంపార్ట్‌మెంట్ మాత్రమే నిండింది. సోమవారం అర్ధరాత్రి వరకు 62,085 మంది స్వామివారిని దర్శించుకోగా 21,335 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.78 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.78,130
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.7,088

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.93,600
రిటైల్ వెండి గ్రాము	రూ.96.60

క్లుప్తంగా

కాలువలో పడి వ్యక్తి మృతి



మృతి చెందిన సుబ్రహ్మణ్యం

గూడూరు రూరల్: గూడూరు రూరల్ పరిధిలోని తిప్పవరప్పాడు గ్రామ సమీపంలో ఓ వ్యక్తి నీటి కాలువలో పడి మృతి చెందిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ కథనం.. గ్రామానికి చెందిన కటకం సుబ్రహ్మణ్యం (50) కుష్టు వ్యాధితో బాధపడుతున్నాడు. పశువుల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అతను గ్రామ సమీపంలో ఉన్న నీటి కాలువ గట్టున పశువులు మేపే సమయంలో అతనికి పిట్స్ వచ్చి నీటిలో పడిపోయాడు. ఊపిరాడక అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు పోలీస్‌లకు తెలియజేశారు. మృతదేహాన్ని కాలువలో నుంచి బయటకు తీసి పోస్టు మార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

నేడు లక్ష బిల్వార్చన, కుంకుమార్చన

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం లక్ష బిల్వార్చన, కుంకుమార్చన నిర్వహించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆలయ అలంకార మండపంలో జరిగే ఈ పూజలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఉద్యోగ నైపుణ్యతకు ప్రత్యేక శిక్షణ

తిరుపతి అర్బన్: విద్యార్హతను బట్టి ఉద్యోగ నైపుణ్యత సాధించడానికి వీలుగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ విభాగం జిల్లా అధికారి లోకనాథం తెలిపారు. జీఎన్‌ఎం మూడేళ్లు, బీఎస్సీ నర్సింగ్ రెండేళ్ల చదువుకున్న వారిని జర్మనీ దేశానికి పంపడానికి ఆరు నెలల పాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. 35 ఏళ్ల లోపు వయస్సు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. స్విమ్స్ నర్సింగ్ కళాశాల వద్ద శిక్షణ ఉంటుందన్నారు. జర్మనీ భాషను సైతం నేర్పిస్తారని తెలిపారు. శిక్షణ సమయంలో ఉచితంగా భోజన వసతులు కల్పిస్తామన్నారు. ఆసక్తి గలవారు బయోడేటాతోపాటు విద్యార్హత సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్, జనన ధ్రువీకరణ పత్రం, అనుభవ సర్టిఫికెట్, వివాహ ధ్రువీకరణ పత్రం, నోటరీ లెటర్, నర్సింగ్ కౌన్సిల్ సర్టిఫికెట్ తదితర వాటిని సమర్పించాలని కోరారు. రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఈ నెల 24వ తేదీ వరకు గడువు ఉందని, డిసెంబర్ 1వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. సమాచారం కోసం 91 60912690లో సంప్రదించాలని సూచించారు.

మమ్మల్ని ఆపేదెవడ్రా?

నాయుడుపేటలో యథేచ్ఛగా ఇసుక దందా

- భారీ టిప్పర్లతో ఇసుక స్మగ్లింగ్‌కు స్కెచ్!
- స్వర్ణముఖి నదిలోకి వేళ్లేందుకు రహదారి ఏర్పాటు
- నది పొర్లు కట్టలను సైతం తెగ్గొట్టిన వైనం
- అడ్డుకున్న గ్రామస్తులకు అధికార పార్టీ నేతల నుంచి బెదిరింపులు



మూర్తిరెడ్డిపాళెం వద్ద స్వర్ణముఖి నది పొర్లు కట్టను తెగ్గొట్టిన అక్రమార్కులు



మూర్తిరెడ్డిపాళెం గ్రామం వద్ద స్వర్ణముఖి నది సమీపంలో భారీ యంత్రాలతో రోడ్డు నిర్మాణం

నాయుడుపేటటౌన్: 'అధికారం మాది.. మేం చెప్పిందే వినాలి.. మేం చేసేదే చూడాలి.. మమ్మల్ని ఆపేదెవడ్రా..' అన్నట్టు చెలరేగిపోతున్నారు.. నాయుడుపేటలోని టీడీపీ నేతలు. ఉచితం మాటున ఇసుకను ఇష్టారాజ్యంగా తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఏకంగా స్వర్ణముఖి నదిలో భారీ యంత్రాలు పెట్టి ఇసుకను టిప్పర్ల ద్వారా తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. నది పొర్లుకట్టలు సైతం తెగ్గొట్టి అక్రమ రవాణాకు రాచబాట వేశారు. గ్రామస్తులు అడ్డుకుంటున్నా బెదిరింపులకు దిగుతున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

కట్ట తెగ్గొట్టి.. యంత్రాలతో బాట వేసి..

మండల పరిధిలోని అయ్యప్పరెడ్డిపాళెం, మూర్తిరెడ్డిపాళెం గ్రామాల వద్ద మంగళవారం భారీ యంత్రాలను తీసుకొచ్చి స్వర్ణముఖి నది పొర్లుకట్టలను తెగ్గొట్టారు. ఆపై టిప్పర్ల ద్వారా ఇసుక తరలించే విధంగా రాచబాట నిర్మించారు. దీన్ని అడ్డుకున్న గ్రామస్తులపై తిరగబడి బెదిరింపులకు దిగారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ట్రాక్టర్లతో తరలింపు

అయ్యప్పరెడ్డిపాళెం, మూర్తిరెడ్డిపాళెం, కల్లిపేడు, తుమ్మూరు, మర్లపల్లి, అన్నమేడు, చిగురుపాడు, భీమవరం తదితర ప్రాంతాల్లో స్వర్ణముఖి నదిలో ఇసుక అక్రమ తరలింపు జోరందుకుంది. కూటమి ప్రభుత్వం వచ్చిన కొద్ది రోజులకే స్వర్ణముఖి నదిలో రాత్రింబవళ్లు ఇసుక దందా కొనసాగుతోంది. సీఎం చంద్రబాబునాయుడు ట్రాక్టర్ల ద్వారా ఉచితంగా ఇసుక తీసుకుపొమ్మన్నారని ఏకంగా యంత్రాలు పెట్టి మరీ ఇసుక తరలించేస్తున్నారు. కొందరు తమిళనాడుకు స్మగ్లింగ్ చేసేందుకు సిద్ధపడినట్టు సమాచారం. మర్లపల్లి గ్రామంలో పదుల సంఖ్యలో ట్రాక్టర్లు రాత్రిపూట ఇసుక తరలిస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు.

తాగు, సాగునీటికి ఇబ్బంది

నదిలో ఇష్టారాజ్యంగా ఇసుక తోడేస్తే తాగు, సాగునీటికి ఇబ్బందులు తప్పవని నదీపరివాహక గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. బోర్లు, బావుల్లో సైతం నీరు అడుగంటుతుందని వాపోతున్నారు. కలెక్టర్ స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని అభ్యర్థిస్తున్నారు.

అడ్డుకుంటాం



అయ్యప్పరెడ్డిపాళెం, మిట్టపాళెం గ్రామాల వద్ద స్వర్ణముఖి నది నుంచి టిప్పర్లతో ఇసుక తరలిస్తే అడ్డుకుంటాం. ఈ ప్రాంత ప్రజలకు తాగు, రైతులకు సాగు నీరుకు ఉన్న ఏకైకా ఆధారం స్వర్ణముఖి నది. దిన్ని నామరూపాలు లేకుండా చేస్తున్నారు. గ్రామస్తులతో కలిసి ఎదుర్కొంటాం.

– కే.వెంకటేష్, మిట్టపాళెం

ఆత్మహత్యలే శరణ్యం



స్వర్ణముఖి నది నుంచి దౌర్జన్యంగా మా గ్రామం నుంచి టిప్పర్లతో ఇసుక తరలిస్తే అడ్డుకుంటాం. ఎవరైనా ఎదురుతిరిగితే ఆత్మహత్యకు కూడా సిద్ధపడతాం. ఇప్పటికే మూర్తిరెడ్డిపాళెం, అయ్యప్పరెడ్డిపాళెం నుంచి ట్రాక్టర్లతో ఇష్టారాజ్యంగా ఇసుక తరలిస్తున్నారు. అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదు.

– కుంపటి సుకుమార్, అయ్యప్పరెడ్డిపాళెం



మూర్తిరెడ్డి పాళెం స్వర్ణముఖి నదిలో ట్రాక్టర్లకు ఇసుక నింపుతున్న కూలీలు



ఇష్టారాజ్యంగా ఇసుక తరలించేసిన దృశ్యం

స్టార్టప్స్‌పై అవగాహన

తిరుపతి సిటీ: ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ కంప్యూటర్ సైన్స్ విభాగంలో రుసా ఆధ్వర్యంలో స్టార్టప్స్, నార్త్, ఈస్టర్న్ యూనివర్సిటీ సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌పై మంగళవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రూసా కో–ఆర్డినేటర్ రమశ్రీ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పీవీ.నరసయ్య, హెడ్ అంజన్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు వ్యాపారవేత్తలుగా రాణించేందుకు స్టార్టప్స్‌పై అవగాహన కల్పించారు. అలాగే నార్త్, ఈస్టర్న్ వర్సిటీ అందించే ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులలో ప్రవేశం పొందేందుకు అసరమైన రిజిస్ట్రేషన్ ప్రక్రియ, కోర్సు ఉపయోగాలపై విద్యార్థులు అవగాహన కల్పించారు. అధ్యాపకులు ఎమ్.పద్మావతమ్మ, కె.విజయలక్ష్మి, శ్రీదేవి, రమేష్‌బాబు, డాక్టర్ ఎ.యశ్వంత్‌కుమార్ పాల్గొన్నారు.

ఎంఫార్మసీ కోర్సుకు స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: ఎస్వీయూలోని ఫార్మసీ కళాశాలలో ఎంఫార్మసీ కోర్సులో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ భూపతినాయుడు, డీఓఏ డైరెక్టర్ వి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీపీజీఈసెట్–2024లో అర్హత సాధించిన వారు మాత్రమే ఈ కోర్సులో ప్రవేశం పొందడానికి అర్హులన్నారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు పూర్తి వివరాలకు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

జీవశాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ

తిరుపతి ఎడ్యుకేషన్ : అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సౌజన్యంతో మంగళవారం తిరుపతిలోని టీటీడీఎం హైస్కూల్‌లో హ్యాండ్స్ ఆన్ ఎక్స్‌పీరియన్స్ ద్వారా జీవశాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు. ముఖ్యఅతిథిగా డీఈఓ కేవీఎన్ కుమార్ హాజరై ప్రారంభించి మాట్లాడారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాల ద్వారా ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవచ్చన్నారు. సైన్స్ టీచర్లు ప్రయోగాలకు అధిక ప్రాముఖ్యత ఇస్తూ బోధించాలన్నారు. ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ గాజులమోహన్, సుమన్, పోలమ్మ, నీరజ పాల్గొన్నారు.

అదరం.. బెదరం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి

- టీడీపీ తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదు
- తాను పార్టీకి తలొగ్గి పనిచేస్తా
- కార్యకర్తలు పోరాట పటిమతో పనిచేయాలి
- టీడీపీ కుట్రలకు భయపడొద్దు
- వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి

శ్రీరంగరాజపురం: టీడీపీ నేతలు చేస్తున్న కుట్రలు, బెదిరింపులకు తాము ఎట్టి పరిస్థితుల్లో బెదరమని, వైఎస్సార్ సీపీ శ్రేణులకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు. శ్రీరంగరాజపురం మండలం కొత్తపల్లిమిట్ట గ్రామంలో మంగళవారం నియోజకవర్గం బూత్ కన్వీనర్ నారాయణరెడ్డి అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ చేస్తున్న తప్పులను కప్పి పుచ్చుకునేందుకు ఆ పార్టీ శ్రేణులు రాష్ట్రంలో సృష్టిస్తున్న అల్లర్లు, అరాచకాలు తార స్థాయికి చేరాయన్నారు. టీడీపీ నేతలు అధికార అహంకారంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై వరుస దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు రోడ్డుపైకి వస్తే టీడీపీ తప్పుడు కేసులు బనాయిస్తోందన్నారు. ఈ తరుణంలో జైలుకు పంపినంత మాత్రాన వైఎస్సార్‌సీపీలో భయపడేవారు ఎవరూ లేరని.. టీడీపీ తప్పులను ఎండగట్టడానికి సమయం దగ్గర పడిందనే విషయాన్ని గుర్తుచేశారు. త్వరలో కార్యకర్తలంతా మమ్మల్ని జైల్లో వేయండంటూ జైల్ భరో కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. సోషియల్ మీడియా వేదికగా టీడీపీ అండ్ కో వైఎస్సార్ కుటుంబంపై చేసిన అభ్యంతకరమైన పోస్టులపై చంద్రబాబు ఎందుకు నోరు విప్పలేదని ప్రశ్నించారు. ఇక భయపెట్టి అధికారంలోకి కొనసాగాలని చూస్తే..ప్రజలు తిరగబడడం ఖాయమన్నారు. ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. నాయకులు, కార్యకర్తలు సైతం సమష్టిగా పనిచేసి చిత్తూరు జిల్లాలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

24న గ్రామీణ ఆటల ఉత్సవం

తిరుపతి అర్బన్: 16వ గ్రామోత్సవ ప్రీమియర్ లీగ్ 2024 పోటీలు తిరుపతిలోని ఎస్వీయూ స్పోర్ట్ కాంప్లెక్స్‌లో ఈ నెల 24న నిర్వహించనున్నట్లు జిల్లా స్పోర్ట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సయద్యబాషా తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం సయద్య బాషా మాట్లాడుతూ ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ పురుషులు, త్రోబాల్ మహిళల పోటీలు జరుగుతాయన్నారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న పంచాయతీ క్రీడా జట్లు ఈ పోటీలకు అర్హులుగా పేర్కొన్నారు. వాలీబాల్, త్రోబాల్‌లో విజేతలైన వారికి నగదు బహుమతి ఉంటుందని చెప్పారు. వాలీబాల్‌లో మొదటి బహుమతి రూ.9 వేలు, 2వ బహుమతి రూ.6 వేలు, మూడో బహుమతి రూ.3వేలు, 4వ బహుమతి రూ.2 వేలుగా ప్రకటించినట్టు వెల్లడించారు. అలాగే త్రోబాల్‌లో మొదటి బహుమతి రూ.5 వేలు, 2వ బహుమతి రూ.3వేలు, 3వ బహుమతి రూ.2 వేలు, 4వ బహుమతి రూ.1,500 అందిస్తామన్నారు. మొదటి రెండు స్థానాలు కైవసం చేసుకున్న జట్లు జోనల్ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తాయన్నారు. వారు డిసెంబర్ మొదటి వారంలో విజయవాడలో జరిగే జోనల్ క్రీడల్లో పాల్గొంటారని వెల్లడించారు. ఫైనల్స్ కోయంబత్తూరులో డిసెంబర్ 28న జరుగుతాయని వివరించారు. స్పోర్ట్ అధికారులతోపాటు ఇషా ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చెరువుల సుందరీకరణ వేగవంతం

తిరుపతి అర్బన్: తిరుపతి నగరంలోని వివిధ ట్యాంక్‌ల సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి కమిషనర్ మౌర్యతో కలసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యంగా వినాయకసాగర్, పాన్‌చెరువు, గొల్లవానిగుంట, కోరమేనుగుంట చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. స్మార్ట్ సిటీలో భాగంగా వినాయక సాగర్, గొల్లవాణి గుంట ఇప్పటికే అభివృద్ధి చేశారని, మిగిలిన వాటి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే తుడా అవిలాల చెరువు అభివృద్ధికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, డీపీవో సుశీలాదేవి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ మనోజ్‌కుమార్

గూడూరు రూరల్ : గూడూరు రూరల్ పరిధిలోని వెంకటరెడ్డిపల్లి గ్రామ సమీపంలో రోడ్డుపై నడిచి వెళుతున్న ఓ వృద్ధుడ్ని ఆటో ఢీ కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల కథనం.. బాలాయపల్లి మండలానికి చెందిన అల్లం ఈశ్వరయ్య(60) తన గేదెలు కనిపించకుండా పోవడంతో వాటిని వెతుక్కుంటూ వెంకటగిరి– గూడూరు రోడ్డుపై నడిచి వెళ్తున్నాడు. ఆదే సమయంలో గూడూరు వైపు వస్తున్న ఆటో అతనిని వేగంగా ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. గూడూరు రూరల్ ఎస్ మనోజ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని పూర్తి వివరాలను సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

పురుగులొస్తున్నాయ్ లోకేషన్నా!

- మంత్రి లోకేష్‌కు మహిళా వర్సిటీ విద్యార్థుల లేఖాస్త్రం
- ట్విటర్, ఈమెయిల్, వాట్సాప్, ఫేస్‌బుక్ మెసేజ్‌లు సంధించిన వైనం



Respected Education and IT minister sir,
We the students of Sri padmavati Mahila visvavidyalayam,Tirupati.Sir,the food which is serving in the hostel,is being worst day by day.We were complaining about the quality of food to the respective individuals ,but they aren't taking action against it instead,they were torturing us in different ways.so,please take action by inspecting the hostels and quality of food.
Thanking u sir...

ట్విటర్, ఈమెయిల్, వాట్సాప్, ఫేస్‌బుక్ ద్వారా మంత్రి లోకేష్‌కు పంపిన మెసేజ్



పొంగలిలో పురుగు ఉన్న దృశ్యం (మంత్రికి షేర్‌చేసిన ఫైల్ ఫొటో)

తిరుపతి సిటీ: 'రాష్ట్ర విద్యా, ఐటీ శాఖా మంత్రివర్యులు నారా లోకేష్‌గారికి మేం ఒక్కటే విన్నవించదల్చుకున్నాం. మేం తినే అన్నం, కూరలు చాలా నాసిరకంగా ఉన్నాయి. తరచూ పురుగులు వస్తున్నాయి. దయ చేసి నాణ్యమైన ఆహారం పెట్టే విధంగా చర్యలు చేపట్టండి' అంటూ తిరుపతి మహిళా వర్సిటీ విద్యార్థులు సోషల్ మీడియా వేదికగా తమ సమస్యలను ఏకరువు పెట్టారు. ట్విటర్, ఈమెయిల్, వాట్సాప్, ఫేస్‌బుక్ మెసేజ్‌ల ద్వారా వర్సిటీలోని వసతిగృహాల దయనీయ స్థితిని మంత్రికి నేరుగా ఫిర్యాదు చేశారు. గతంలోనూ హాస్టల్స్‌లో భోజన వసతులపై విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. అయినా మార్పు రాకపోవడంతో ఇప్పుడు ఏకంగా విద్యార్థులే మంత్రికి ఫిర్యాదు చేశారు. నాలుగు నెలలుగా ఇదే పరిస్థితి ఎదురవుతోందని వాపోయారు. అధికారులు, హాస్టల్ సిబ్బందికి విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ప్రశ్నించిన విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. హాస్టళ్లను అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సూచించారు.

పొంగలిలో పురుగు పడ్డా పట్టించుకోలేదు

మహిళా వర్సిటీలోని అంజీరా బ్లాక్ వసతి గృహంలో గత శనివారం ఉదయం వడ్డించిన పొంగలిలో పురుగులు పడ్డాయి. ఆదే విషయాన్ని హాస్టల్ సిబ్బందికి, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న పాపాన పోలేదు. తమ నోరు నొక్కి విషయాన్ని బయటకు పొక్కకుండా అణచివేశారు. ఒక్కో విద్యార్థి నుంచి నెలకు రూ. 4వేల వరకు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. అయినా నాణ్యమైన ఆహారాన్ని పెట్టడం లేదు. విద్యార్థినులు చాలా మంది హాస్టల్ భోజనంపై విరక్తి చెంది క్యాంటీన్‌లో, బయట నుంచి ఫుడ్ ఆన్‌లైన్‌లో ఆర్డర్లు పెట్టుకుంటున్నారు.

– విద్యార్థినులు, మహిళా వర్సిటీ

విచారకరం

మహిళా వర్సిటీలోని వసతిగృహాలలో మౌలిక వసతులు, నాణ్యమైన భోజనంపై ఏఐఎస్ఎఫ్, వైఎస్సార్‌సీపీ, ఎన్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌ఓ వంటి ఐక్య విద్యార్థి సంఘాలు అధికారులను కలసి పలు మార్లు వినతి పత్రాలు అందించాం. కానీ తీరు మారకపోవడం విచారకరం. ఇప్పటికైనా విద్యార్థినుల వసతి గృహాలపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంచి నాణ్యమైన ఆహారం అందించాలి. లేకుంటే నిరసనలు, ధర్నాలతో కదం తొక్కుతాం.

–విద్యార్థి సంఘాల ఐక్య వేదిక, తిరుపతి

నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నాం

మహిళా వర్సిటీ హాస్టల్‌లో నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నాం. పొంగలిలో పురుగు వచ్చిందన్న విషయంపై మాకు ఎవ్వరూ ఫిర్యాదు చేయలేదు. ఓ విద్యార్థిని రాష్ట్ర మంత్రికి మెసేజ్ ద్వారా ఫిర్యాదు పంపిందని వార్తలు రాగానే విచారణ చేపట్టాం. ఆహారంలో పురుగులు ఉన్నట్లు వచ్చిన ఆరోపణలు అవాస్తవమని తేలింది.

– ప్రొఫెసర్ వీ.ఉమ, ఇన్‌చార్జి వీసీ, మహిళావర్సిటీ

విశ్వం విద్యాసంస్థకు జాతీయ అవార్డు



నటి అదాశర్మ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న విశ్వచందన్‌రెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థకు ఇండియాస్ మోస్ట్ ట్రస్టెడ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ది ఇయర్–2024 జాతీయ అవార్డు లభించింది. ఈ అవార్డును బెంగళూరులో ప్రముఖ బాలీవుడ్ నటి అదా శర్మ చేతుల మీదుగా ఆ విద్యాసంస్థ అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి అందుకున్నారు. గత 34ఏళ్లుగా స్కూల్ సిలబస్‌తో పాటు సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ వంటి పోటీ పరీక్షలకు ఉత్తమ శిక్షణ అందిస్తూ జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నందుకు మై బ్రాండ్ బెటర్ సంస్థ ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు విశ్వచందన్‌రెడ్డి తెలిపారు.

బీఫార్మసీ కౌన్సెలింగ్ చేపట్టాలి



మాట్లాడుతున్న ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలో విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే బీ–ఫార్మసీ కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేయాలని ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.అశోక్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 135 ఫార్మసీ కళాశాలలు ఉన్నాయని, అయితే 90 కళాశాలలకు మాత్రమే జీఓ విడుదల చేసి, కౌన్సెలింగ్ తేదీలను ప్రకటించలేదన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా విద్యా సంవత్సరాన్ని విద్యార్థులు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బీ–ఫార్మసీ విద్యార్థులకు కౌన్సెలింగ్‌కు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులను సమీకరించి మంత్రి నారా లోకేష్ క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఆంధ్ర విద్యార్థి సంఘ నేతలు మనోజ్‌కుమార్, శేషు, దివాకర్‌రెడ్డి, మునికుమార్, గౌతమ్, సాయిప్రకాష్ పాల్గొన్నారు.

నేటి నుంచి సీ విజిల్ ఎక్సర్‌సైజ్ ప్రోగ్రాం



విజిల్ కార్యక్రమంలో పాల్గొనబోయే పోలీస్ సిబ్బందికి శిక్షణనిస్తున్న దృశ్యం

సూళ్లూరుపేట : నేవీ, కోస్టుగార్డ్స్, మెరైన్, సివిల్ పోలీసుల ఆధ్వర్యంలో సీ విజిల్ ఎక్సర్‌సైజ్ అనే కార్యక్రమాన్ని ఈనెల 20, 21 తేదీలలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 దాకా నిర్వహించనున్నట్టు సీఐ మురళీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో 45 మంది పోలీస్ సిబ్బంది పాల్గొంటారన్నారు. బందోబస్తులో కార్యక్రమంలో పాల్గొనే సిబ్బందికి శ్రీహరికోట మెరైన్ సీఐ మాల కొండయ్య, సీఐ మురళీకృష్ణ శ్రీహరికోట పోలీస్‌స్టేషన్ వద్ద రెండు రోజుల పాటు నిర్వహించబోయే విధుల గురించి వివరించారు. సముద్రతీరంలో భద్రతను పెంచే క్రమంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వెల్లడించారు. శ్రీహరికోట ఎస్ఐ శ్రీకాంత్, మెరైన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నం



తనిఖీలు చేస్తున్న క్లూస్ టీం పోలీసులు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని శ్రీకాళహస్తి బైపాసు రోడ్డు వద్ద ఉన్న యాక్సిస్ బ్యాంక్ ఏటీఎంలో సోమవారం అర్ధరాత్రి సమయంలో ఓ దుండగుడు చోరీకి యత్నించిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసుల కథనం.. ముఖానికి ప్లాస్టిక్ కవర్ పెట్టుకుని ఓ వ్యక్తి ఏటీఎంలోకి ప్రవేశించాడు. అతని వద్ద ఉన్న భారీ గునపంతో ఏటీఎంను పగులగొట్టాడు. ఏటీఎం ముందు భాగంలో ఉన్న వాటిని గునపంతో ధ్వంసం చేశాడు. చివరగా నగదు ఉన్న కౌంటర్‌ను పగులగొట్టే ప్రయత్నం చేయగా.. ఒక్కసారిగా సైరన్ మోగడంతో దుండగుడు అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునే సరికి దొంగ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ విషయమై బ్యాంక్ మేనేజర్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముందు రోజే ఏటీఎంలో భారీగా నగదు పెట్టినట్లు పోలీసులు తెలుసుకున్నారు.

పూర్తి స్థాయిలో దర్యాప్తు

ఏటీఎంలో చోరీకి యత్నించిన ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరుపుతామని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. మంగళవారం జిల్లా క్లూస్‌టీం ఎస్ఐతో పాటు ఐడీ పోలీసులచేత నిశితంగా పరిశీలించినట్టు వెల్లడించారు. ఆయన వెంట ఎస్ఐ శ్రీహరబాబు ఉన్నారు.